www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 13 | ఏప్రిల్ | 2025
పేజీలు 8

## దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



-కోల్డ్ స్టోరేజీ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

8 లో

# కల్తీకాటు..!



- భారీగా ఆహార పదార్థాల కల్తీ
- నాసిరకం వస్తువులతో వంటకాలు
- తయారీ విధానం లోపభూయిష్టం
- విషపూరితమవుతున్న నూనెలు
- ఆరోగ్యాలు అధోగతి
- కొనసాగుతున్న నిఘా కల్తీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** పెరిగిన జనాభా, యాంత్రిక జీవనం అప్పటికప్పుడు సిద్ధంగా ఉండే ఆహారం వైపు అడుగులేస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా హోటళ్లు పెరిగిపోతున్నాయి. అన్ని హంగులతో ఉండే పెద్దపెద్ద హోటటళ్లతో పాటు పెద్దసంఖ్యలో చిన్న హోటళ్లు కూడా అన్ని రకాల ఆహార పదార్థాలను విక్రయిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.... లాభాపేక్ష కల్తీవైపుకు అడుగులేయిస్తోంది. దీంతో ప్రజలు రకరకాల వ్యాధులభారిన పడుతున్నారు. పాలు,కాఫీ పొడి మొదలుకుని పసుపు,కారం, పప్పులు, వంట నూనెలు, మషాలాలు, కల్తీమయం అవుతున్నాయి. ఆహారపదార్థాల తయారీ, పంటకాలు, నిల్వలు, పంపిణీ, అమ్మకం ఆహార భద్రతా చట్టం 2006కు విరుద్ధంగా ఉందనే వాదన బలంగా ఉంది. భారతఆహారభద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) చట్టం సరిగా అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అంతా నాసి,పాసి...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు హోటళ్లలో అంతా నిసరకమైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కేవలం 10 నుండి 20 శాతం వరకు ఉన్న హోటళ్లలో స్వచ్ఛత ఉన్నప్పటికీ మిగతా అంతా కాసుల కక్కుర్తి కోసం పాకులాడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో చిన్న ఊరి నుండి మొదలుకుని పెద్ద పట్టణా వరకు పది మీటర్లకు ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు వెలుస్తున్నాయి. కొన్ని హోటళ్లలో అపరిశుభ్రతా తాండవిస్తున్నప్పటికీ

మిగతా 2లో..

## వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

-సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన




2 లో

### రాజ్యాంగ స్ఫూర్తికి
## విఘాతం కలిగిస్తున్న కేంద్ర సర్కార్

సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా




2 లో

## పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతి

- కోటికి పైగా మొక్కలు నాటిన రామయ్య
- పద్మశ్రీ పురస్కారంతో పాటు పలు అవార్డులు
- ప్రధాని మోడీ, రెండు రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, మంత్రులు నివాళి









**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో గల రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య(87) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో భాధపడుతూ...తెల్లవారుజామున ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు.కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కాగా రామయ్య కేంద్ర ప్రభుత్వం నుంచి 2017లో పద్మశ్రీ అవార్డునే సైతం అందుకున్నారు. సామాజిక సేవను గుర్తించి మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపరిచారు. అందుకు తగ్గట్టుగానే ఆయన సైతం తనకు ఎంతో ఇష్టమైన మొక్కల పేర్లను వనజీవిగా మార్చుకున్నారు. అలాగే తన నలుగురు మనుమళ్లు, మనుమరాళ్లకు చందనపుష్ప, హరితలావణ్య, కబంధపుష్ప, వనశ్రీ అని చెట్ల పేర్లను పెట్టుకున్నారు. తన తుది శ్వాస విడిచేంత వరకు మొక్కలు నాటడం, విత్తనాలను సేకరించడంలో నిమగ్నమయ్యారు. కోటికి పైగా మొక్కలు నాటిన రామయ్య మృతి చెందడం పట్ల ప్రధానీ మోడీ, రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఎనుముల రేవంత్‌రెడ్డి, నార చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎంలు మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నార లోకేష్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్లు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పలువరు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని, మృతికి నివాళి,

మిగతా 2లో..

## రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న కేంద్ర సర్కార్

**ప్రజాపక్షం/సుజాతనగర్:** భిన్న సంస్కృతులు, భిన్న జాతులు, భాషలు, మతాలు కార్చర్ల 147 కోట్ల మంది భారతీయులను ఒక్కతాటి పైకి తెచ్చిన మన రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలనా సాగిస్తోందని, పార్లమెంటులో ఉన్న మందబలంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర సర్కారుపై ప్రజలు తిరగబడితేనే ప్రజాస్వామ్యం రక్షించబడుతుంది అని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వరకు సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన దేశవ్యాపిత నిరసనల పిలుపులో భాగంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండలం కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సర్దార్ భగత్ సింగ్ చిత్రపటాలతో మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ కులం కన్న దేశం మిన్న అని భావించిన భగత్ సింగ్ త్రయం లాంటి అనేక మంది దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని, స్వేచ్ఛాయుత భారతావనికి దేశం గర్వించదగ్గ రాజ్యాంగాని డాక్టర్ అంబెద్కర్ అందించాడని అన్నారు. త్యాగధనుల ఆశయాలకు తూట్లు పొడుస్తూ, రాజ్యాంగాన్ని స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ బిజెపి వ్యవహరిస్తున్న తీరును ప్రజలు ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని, ప్రశ్నించిన వారిని నిర్బంధాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సిబిఐ, ఈడీ, ఎన్నికల సంఘం తదితర రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ దక్షిణాది రాష్ట్రాలపై వివక్షత ప్రదర్శిస్తున్నారన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలకు, మహిళలపై దాడులు ప్రమాదకర పరిస్థితుకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి దేశ సార్వభౌమత్వాన్ని మంటగలుపుతున్నారని, దేశంలోని సహజవనరులను, ప్రభుత్వ సంస్థలను, వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ విద్యను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తూ పేద, మధ్యతరగతి వర్గాలను రోడ్డు



పాలు చేస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను సైతం యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే దుశ్చర్యాలకు కేంద్రం పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు అప్రమత్తమై కేంద్ర చర్యలను తిప్పికొట్టి దేశాన్ని బిజెపి నుంచి రక్షించుకోవాలని కోరారు. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అయన కృషికి రాజకీయాలకు అతీతంగా సహరించాలని, కొందరు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని వారికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎమ్ ధనలక్ష్మి , కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, తాళ్ల వెంకటేశ్వరరావు ధర్మరాజు, యూసుఫ్, నేరెళ్ల రమేష్, తాళ్లూరి పాపారావు పొదిల శ్రీనివాసరావు సిపిఐ నాయకులు, గణేష్, గోవిందు, ఉపేందర్ వీర్ల, మల్లేష్, దుర్గ బొడ్డు కేశవరావు భాగం కృష్ణ మేకల వెంకటేష్ గడ్డం రాజేందర్ రసూల్, అంకూస్, కొమారి కృష్ణ, ముక్కెర మురళి, సాపావట్ రవి, మాన్యా తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతి



(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు.

**రామయ్య నేపథ్యం...**

ముత్తగూడెం గ్రామానికి చెందిన వనజీవి రామయ్య తనకు రెడ్డిపల్లిలో పొలం ఉండటంతో ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. జూలై 1తేది 1937లో లాలయ్య,పుల్లమ్మ దంపతులకు జన్మించారు. అసలు పేరు రామయ్య కాగా...మొక్కలు నాటడమే జీవిత ఆశయంగా మలుచుకొని ఇంటిపేరును వనజీవి రామయ్యగా మార్చుకున్నారు. రామయ్య అభ్యసం ముత్తగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. అటు తర్వాత 15సంవత్సరాలకు కుటుంబ సభ్యులు కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జానమ్మతో వివాహం జరిపించారు. వీరికి నలుగురు సంతానం..ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె, ఇందులో ఇద్దరు కుమారులు మృతి చెందారు. ఓ పక్క కుటుంబ బారాన్ని మోస్తునే తనకేంతో ఇష్టమైన మొక్కలను నాటేవారు.

**రామయ్యను వరించిన అవార్డులు..**

రామయ్య సామాజికి సేవలకు గాను 2017లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, 2005వ సంవత్సరంలో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి వనమిత్ర, యూనివర్సల్ గ్లోబల్ షీప్ అంతర్జాతీయ సంస్థ నుండి గౌరవ డాక్టరేట్, 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవ అవార్డు, 2000లో అప్పటి సీఎం నారచంద్రబాబు నాయుడు వనజీవి సేవలకు గాను ఒక మోషెట్‌ను కొనిచ్చారు. ప్రతి నెల రూ.1500 గౌరవ భృతిని కేటాయించారు.

**సిపిఐ పార్టీ నేతల నివాళి...**

వనజీవి రామయ్య మృతికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మొహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, రామ్మూర్తి నాయక్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఆర్‌డీఓ నరసింహరావు, తహశీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, క్రాంతితో పాటు పలు పార్టీల నేతలు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు, సామాజికవేత్తలు నివాళులర్పించారు.

## పాత ఇనుప దుకాణంలో అగ్నిప్రమాదం.. కార్లు దగ్ధం

**ప్రజాపక్షం/భద్రాచలం :** పాల్వంచలోని పాత ఇనుప దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈఘటనలో సమీపంలో ఉన్న కార్లు దగ్ధమయ్యాయి. వివరాల ప్రకారం, పాల్వంచలోని తెలంగాణ నగర్ సమీపంలో గల పాత ఇనుప దుకాణంలో వాహనాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుంటగా ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో ప్రక్కనే ఉన్న పది కార్లు వరకు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగినమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని రెండు ఫైరింజన్లతో మంటలను ఆదుపులోనికి తెచ్చారు. కాగా అక్కడ పనిచేస్తున్న వారంతా క్షేమంగా బయపడ్డారు. అనుమతులు లేకుండా అనేక పాత ఇనుప దుకాణాలు విచ్చల విడిగా నడుస్తున్నాయి. ఏమాత్రం ఫైర్ సేఫ్టీ లేకుండా, ప్రమాణాలు పాటించకునండా ఇలాంటి కార్యకలాపాలు నర్వహిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారల నిర్లక్ష్యం కారణంగా, ముడుపులు ఇస్తున్న కారణంగా పాత ఇనుప వ్యాపారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని పాత ఇనుప దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అధికారులు దాడులు నిర్వహించాలని సమీప ప్రజలు కోరుతున్నారు.

## కల్తీకాటు..!



(మొదటిపేజీ తరువాయి)

వాటుగా కన్నేసే వారే కరువయ్యారు. ఆహార పదార్థాలపై బొద్దింకలు, ఈగలు, దోమలు తిరుగుతున్నా పట్టింపు లేదు. మరి కొన్ని సందర్భాల్లో మాంసం, చేపలు, రొయ్యలు వంటివాటిని డీప్ ఫ్రిజుల్లో ఉంచి ఆహార ప్రియులు కొరగానే అడిగిందే తడువుగా రోజుల కొద్దీ నిల్వ ఉన్న మాంసాహారాలు, చేపలకు రంగు పులుమి, మషాల దట్టించి వేడివేడిగా వడ్డిస్తున్నారు. దీంతో రుచికి రుచి, వేడివేడి ఆహారం కావడంతో లొట్టలేసుకుంటా భుజిస్తున్నారు. విద్యార్థులు సైతం విషాహారపు భారినపడి అనారోగ్యాల పాలవుతున్న సందర్భాలు లేకపోలేదు.

**విషపూరిత నూనెలు...**

తయారు చేసే ఆహారపదార్థాలను విషపూర్తిమైన నూనెతోనే చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నూనెలో నాణ్యత లోపించగానే వేరే నూనె తో వంటకాలు తయారీ చేయాలి, కానీ అలా కాకుండా మరుగుతున్న నూనెలోనే కొత్తనూనెను పోసి ఆహారపదార్థాలు తయారు సాగిస్తున్నారు. న్యూడిల్స్, ఎగ్‌ఫ్రైడ్ రైస్, చికెన్ ఫ్రై, ఫిష్‌ఫ్రై వంటి వాటితో పాటు రకరకాల వంటకాలు పూర్తిగా పనికిరాని నూనెతోనే తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. నూనె బాగా మరిగిపోయి బుడకలు తేలి వాసనొస్తున్నప్పటికీ ఆ నూనెతోనే ఫ్రైలు, రోస్టులు తయారు చేసి అందిస్తున్నారు. తద్వారా ప్రజల ఆనేక రోగాల భారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

**ఆరోగ్యాలు ఢమాల్...**

ఆహారం విషయంలో ప్రజలు అప్రమత్తంగా లేకుంటే ఆరోగ్యాలు పూర్తిగా క్షీణించి మృత్యువాత పడే అవకాశం ఉంది. ప్రతీ ఏంటా కల్తీ కాటుకు ప్రపంచ వ్యాప్తంగా 60 నుండి 70 లక్షల మంది రకరకాల వ్యాధుల భారిన పడుతున్నట్లు, వీటిలో సుమారు 4 లక్షల నుండి 4.5 లక్షల మంది మృత్యువాతపడుతున్నట్లు, ఈ విషవలయంలో 5 నుండి 10 ఏళ్ల వయసు ఉన్న పిల్లలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఈ మరణాల సంఖ్య ఇంకా ఎక్కువుండే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు,. చర్మం సంబంధిత వ్యాధులు చుట్టుముడుతున్నటున్నట్లు వైద్యులు పలు సందర్భాల్లో సోషల్ మీడియా వేధికగా చెబుతూనే ఉన్నారు. కలుషిత తాగనీరు, ఆహారం కారణంగా సుమారు 200 రకాల వ్యాధు లభారిన పడే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆహార భద్రత కల్తీని అరికట్టేందుకు సంబంధిత చట్టాలకు పదును పెట్టి ప్రాంతీయ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కల్తీ విషయంలో అధికారులు వత్తాసును నియంత్రించేందుకు కఠిన చర్యలు ఎంతైన అవసరం.మరో ప్రక్క బయట తీసుకునే ఆహారంపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**దాడులు చేస్తున్నాం : కిరణ్, ఆహార భద్రతాధికారి**

ఆహార భద్రత విషయంలో క్రమం తప్పకుండా దాడులు నిర్వహిస్తున్నాం. నాణ్యత లోపించినట్లు తేలితే జరిమానాలు విధిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా దాడులు నిర్వహిస్తాం.

## వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు ఉభయ సభల ఆమోదం ద్వారా బిజెపి తన మతోన్మాద, మతపరమైన విభజన ఎజెండాను మరింత ముందుకు తెచ్చిందన్నారు. మైనార్టీ ముస్లింలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే ట్రిపుల్ తలాక్, సిఏఏ లాంటి చట్టాలకు జతగా వక్ఫ్ బిల్లును తీసుకు వచ్చారన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు తొమ్మిది లక్షల హెక్టార్లలో విస్తరించిన 8.7 లక్షల వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసమే ఈ చట్టాన్ని తీసుకు వచ్చారని ఆయన విమర్శించారు. ముస్లింలకు వ్యతిరేకంగా పలు అంశాలు ఈ చట్టంలో ఉన్నాయని సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం ఇస్లామిక్ చట్టాల ప్రకారం మతపరమైన దాతృత్వం కోసం దానంగా ఇచ్చిన ఆస్తులను ముస్లిమేతరులకు కట్టబెట్టడం సమాంజసం కాదన్నారు. భవిష్యత్తులో వక్ఫ్ భూముల వివాదాలకు సంబంధించి పరిష్కార బాధ్యత, వక్ఫ్ భూముల నిర్ధారణ బాధ్యత ప్రభుత్వ అధికారికి మొత్తంగా కట్టబెట్టడం ఉద్దేశ్యపూర్వకంగా ముస్లింలను భయాందోళనలకు గురి చేయడంతో పాటు వారిని ప్రధాన స్రవంతి నుంచి వేరు చేయడం అవుతుందని ఆయన విమర్శించారు. ఈ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగం కల్పిస్తున్న మతస్వేచ్ఛ హక్కు, మత వ్యవహారాల నిర్వహణ హక్కులను నిర్ధారిస్తున్న రాజ్యాంగంలోని 25,26 అధికారణలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన అన్నారు. ముస్లిం ప్రయోజనాలు దెబ్బతీసేవిధంగా తీసుకు వచ్చిన ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఇది ముస్లింలను విభజించడానికి తీసుకు వచ్చిన చట్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మినారాయణ, నూనె శశిధర్, ఎస్‌కె చానా, రెహ్మాన్, తాటి నిర్మల, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో వైరా లయన్ ఐ కేర్ హాస్పిటల్






**-కంటి చూపుకి కేరాఫ్ అడ్రస్ లయన్ ఐ కేర్ వైరా**
**-గత 16 సంవత్సరాలుగా ఉచిత కంటి చికిత్స**
**-డాక్టర్ కాపా మురళీకృష్ణ సారథ్యంలో ఏర్పాటైన ఐ కేర్ హాస్పిటల్**
**-నేటికీ జిల్లావ్యాప్తంగా మన్నలను పొందుతున్న లైన్ ఐ కేర్**





**ప్రజాపక్షం/వైరా:** లయన్ ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సారథ్యంలో ఏర్పాటు చేసిన లయన్ ఐకేర్ హాస్పిటల్ గత 16 సంవత్సరాలుగా సమాజ సేవలో ప్రజలకు ఉచిత కంటి చికిత్సను అందిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ప్రజల మన్నలను పొందిన వైరా లయన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్ ఫాస్ట్ వర్నర్ వైరాలో వైద్యరంగంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ చంద్రకళ దంపతులు చెరగని ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా సమాజ సేవలో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని ఒక తపనతో వుంద్రు శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో సాగే విధంగా లయన్ ఐకేర్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ తల్లిదండ్రులైన కాపా గోపాలరావు, ఆదిలక్ష్మి దంపతులు ఈ హాస్పిటల్ నిర్మాణానికి పునాదిరాళ్లు వేశారు. ఎంతోమందికి కంటి చూపును ప్రసాదిస్తున్న లయన్ ఐ కేర్ హాస్పిటల్ ఇప్పటివరకు సుమారు 42000 మందికి కంటి ఆపరేష్లు చేయడంతో పాటు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వైరా బస్టాండ్ నుండి లయన్ ఐ కేర్ నగర్ వరకు రోగుల కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లయన్ ఐకేర్ హాస్పిటల్ నందు నిత్యం డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్రీధర్‌గౌడ్ అందుబాటులో ఉంటూ కంటి పరీక్షలు నిర్వహిస్తూ జిల్లావ్యాప్తంగా వైరా లయన్ ఐ కేర్ హాస్పిటల్ చెరగని ముద్ర వేసుకున్నారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్స్‌క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ జిల్లాలోనే ఎంతోమందికి కంటి చూపుని ప్రసాదించే గొప్ప వ్యక్తిత్వంతో భావితరాలకు భవిష్యత్తుకు భరోసా ఇచ్చే విధంగా లయన్ ఐ కేర్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లయన్ ఐకేర్ హాస్పిటల్ ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కంటిచూపు అంటే వైరా లయన్స్ ఐ కేర్ అనే మాట ఇది. ప్రజల నోట వినిపిస్తుంది. నిత్యం హాస్పిటల్‌కి వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చల్లని మినరల్ వాటర్ ఏర్పాటు చేసి రోగులకు అందిస్తున్నారు. అత్యంత టెక్నాలజీతో కూడిన లేజర్ ట్రీట్మెంట్‌ను కూడా ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత వైరా లయన్ ఐ కేర్ హాస్పిటల్‌ది. ఇప్పుడు లేజర్ ట్రీట్మెట్ అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని కాని వైరా లయన్ ఐ కేర్ హాస్పిటల్‌లో అతి తక్కువతో ప్రజలకు లేజర్ ట్రీట్మెంట్‌ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు తెలంగాణతో పాటు ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా పెద్ద ఎత్తున లయన్ ఐ కేర్ హాస్పిటల్‌కు తరలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ప్రత్యేక ఐ కేర్ క్యాంపులు పెట్టి గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఎందుకు అంటే కంటిచూపు అంటే లయన్ ఐ కేర్ లయన్ ఐ కేర్ అంటే కంఇచూపు అనేది ఇది ప్రజల మాట. ఇలాంటి హాస్పిటల్ ప్రజలకు మరెన్నో సేవలు చేయాలని మరెన్నో సేవలు అందిస్తామని ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్ బాబు, వరలక్ష్మి దంపతులు తెలుపుతున్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు బిల్లు రద్దు చేయాలని నిరసన



**ప్రజాపక్షం/వైరా:** వక్స్‌బోర్డు అమెండ్మెంట్ బిల్లుకు వ్యతిరేకంగా రద్దు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ వైరా నియోజకవర్గ కార్యదర్శి యర్ర బాబు, మండల కార్యదర్శి యామాల గోపాలరావుతో కలిసి మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వ్రాసిన భారత రాజ్యాంగానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ భారతదేశ లౌకికవాదాన్ని దెబ్బతీస్తుందని, వక్స్ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ఈ చట్టం వలన ఎంతోమంది పేద ముస్లింలకు అన్యాయం జరుగుతుంది అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కులమత రాజకీయాలను చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం వక్సబోర్డు బిల్లును రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి రాఘవరావు, మోటా కొండ, రామకృష్ణ, షేక్ షరీఫ్, మధు, ఆళ్ళ రాంబాబు, బండారుపల్లి ముత్తయ్య, ముస్లీం సోదరులు, షేక్ సోందు, ఉద్దండు, కౌసర్, షరీఫ్, అఫ్జల్, రైహిన్, ఫిరోజ్ రహీం అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా రింగు రోడ్డు వద్ద మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై గుంటలకు మరమ్మత్తులు చేపట్టాలంటే శనివారం రింగు రోడ్డు వద్ద సిపిఐ నిరసన తెలిపింది. సిపిఐ నాయకులు గుంటల వద్దకు వెళ్లి జెండాలు పట్టుకొని ఇలా గుంటలు ఉంటే ప్రయాణం చేసేది ఎలా అంటూ అధికారులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు యర్ర బాబు, యామాల గోపాలరావు మాట్లాడుతూ అధికారులు వెంటనే గుంటలను మరమ్మత్తులు చేపట్టాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే విధంగా గుంటలు ఉన్నాయని, ఎలాంటి ప్రమాదం జరిగిన పెద్ద ఎత్తున నష్టం జరిగిందని వారు అన్నారు. ఇంత పెద్ద గుంటలు రోడ్డుపై ఏర్పడితే అధికారులకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ఈ గుంటల్లో వాహనాలు నడపాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల జరిగిన ఆర్‌టిసి బస్సు ప్రమాదంలో పలువురుకి స్వల్ప గాయాలైన సంఘటన కూడా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశో, కొండ షరీఫ్, ఆళ్ళ రాంబాబు, మధు, బండారుపల్లి ముత్తయ్య పాల్గొన్నారు.

# లక్ష్మీసాహితిని అభినందించిన సిపిఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం



**ప్రజాపక్షం/వైరా:** వైరాకి చెందిన సంగెపు వెంకటేశ్వర్లు కూతురు సంగెపు లక్ష్మీ సాహితి గ్రూప్ వన్ ర్యాంకు సాధించడం పట్ల శనివారం వైరాలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా రైతు సంఘం నాయకులు తండు సోమయ్య, దొబ్బల కృష్ణ, కొండా రామకృష్ణ, మండల కార్యదర్శి యామాల గోపాలరావు, చల్లా రామకోటయ్య, అడపా కృష్ణయ్య, డాక్టర్ సంగెపు కృష్ణలు, గ్రూప్ వన్ ర్యాంకర్ లక్ష్మీ సాహితిని అభినందించి శాలువాతో సన్మానించారు. లక్ష్మీ సాహితిని ఆదర్శం తీసుకొని యువత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని వారు పేర్కొన్నారు. లక్ష్మీ సాహితి గ్రూప్ వన్ ర్యాంకు సాధజంచడం ఎంతోమందికి ఆనందాన్ని కలిగించిన కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

# పోగొట్టుకున్న ఫోన్ రికవరీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం విప్పల మడక గ్రామానికి చెందిన రుద్రాక్షల లక్ష్మీ అనే వికలాంగురాలు గత కొన్ని రోజుల క్రితం మధిర నుండి వైరా వస్తుండగా బస్సులో ఫోన్ పోవడంతో వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వైరా ఎస్సై వంశీ కృష్ణ భాగ్యరాజ్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఫోన్ రికవరీ చేసి తిరిగి వికలాంగురాలికి అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్ దొరకడంతో బాధితుఉరాలు ఆనందం వ్యక్తం చేసి వైరా ఎస్సైకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

# లక్ష్మీసాహితిని అభినందించిన ఎస్సై



**ప్రజాపక్షం/వైరా:** వైరాకు చెందిన సంగెపు వెంకటేశ్వరరావు కుమార్తె గ్రూప్‌వన్‌లో ర్యాంకు సాధించిన సంగెపు లక్ష్మీ సాహితిని అభినందించి శాలువా కప్పి సన్మానించిన వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్, డాక్టర్ కుదరుపాక మోహన్‌రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని దానికి నిదర్శనం లక్ష్మీ సాహితి అని అన్నారు. యువత ఏదైనా సాధించాలని పట్టుదలతో దానిని సాధించేంత వరకు కృషి చేయాలని వారు తెలిపారు.

# నంబూరి మధు చిత్రపటానికి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో నంబూరి మధు ప్రథమ వర్ధంతిని వైరాలో ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వైరా జర్నలిస్టులు నంబూరి మధు చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఏపూరి రాజారావు, సూతకాని ప్రేమ్‌చంద్, పులి కృష్ణార్జున్‌రావు, గద్వాల్ రవీందర్, అక్కిశెట్టి రవితేజ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ వన్ ర్యాంకర్ శిరీషకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** గ్రూప్ వన్‌లో ర్యాంకు సాధించిన శిరీషకు పిఆర్‌టియు ఆధ్వర్యంలో శనివారం సన్మానం నిర్వహించారు. వైరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్‌లో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శిరీష ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో గ్రూప్ వన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖ వైరా మండల శాఖల ఆధ్వర్యంలో శిరీషని సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిఆర్‌టియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదగడం అనేది నిజంగా నేటితరం యువతకు ఆదర్శం అని శిరీష కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గరికపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణ, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నాగబత్తిని స్వప్న, ప్రేమ్‌లీలా, విజయ, అమృత కుమార్, ఉపాధ్యక్షులు కట్టా శేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రెబ్బా శ్రీనివాసరావు, సోమ్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి శనివారం తనిఖీ చేశారు. అనంతరం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొని, ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పలు సమస్యలపై చర్చించారు. ఆసుపత్రి పరిశుభ్రత, డాక్టర్స్, సిబ్బంది వివరాలు, ఇన్, ఔట్ పేషంట్స్ వివరాలను అడిగి తెలుసుకుని, రికార్డ్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లో ఇన్ పెషేంట్ లకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ కమిటీ సభ్యులు మొరిశెట్టి సాంబశివరావు, ఫయాజ్ అలీ, ఈనపనూరి కుమారి, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, చల్లగుళ్ల కృష్ణారావు, కమల్ పాషా, పింగళి సామెలు, మానుకోట ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చిన దాసరి



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల జలగం నగర్ 1 లో గత రెండు రోజుల నుంచి మోటార్ మోరాయించి, ప్రజలు త్రాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతుండటం, విషయాన్ని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న గ్రామాభివృద్ధి ప్రదాత దాసరి మధుమోహన్ రెడ్డి వేసవి దృష్ట్యా సమస్యను తక్షణమే పరిష్కరించాలనే సంకల్పంతో కొత్త మోటారును అందించటమే కాకుండా సమస్య మరలా పునరావృతం కాకుండా గోదావరి పైపు తదితర సామాగ్రిని గ్రామపంచాయతీ సెక్రటరీకి శనివారం అందజేయటమే కాకుండా, దగ్గరుండి పని చేయించి జలగం నగర్ ప్రజలందరికీ త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారమయ్యేలా చేశారు. ఈ సందర్భంగా తమ త్రాగునీటి కష్టాలను తీర్చిన దాసరి మదుమోహన్ రెడ్డికి, ఆయన టీం సభ్యులకు గంగారం, జలగం నగర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. దాసరి మాట్లాడుతూ తన సొంత ఖర్చుతో గంగారం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తునన్నారు.

## సర్వర్ అంతరాయంతో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల ఇబ్బందులు




ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వతేదీ వరకు ప్రభుత్వం గడువు ఇవ్వడంతో శనివారం ఆన్‌లైన్ సెంటర్లలకు దరఖాస్తు దారులు పోటెత్తడంతో సర్వర్లు సహకరించకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లాకమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఎటువంటి ఉపాధి కలగపోవడం వలన యువత నుండి రోజురోజుకు ఆశావాహుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. సంబంధిత సైట్ పనిచేయకపోవడంతో దరఖాస్తులు తీవ్ర నిరాశకు గురువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని సమయాన్ని పెంచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాచవరం, నారాయణపురం, రేమిడిచర్ల, వెంకటాపురం, నర్సింహారావు, సత్యనారాయణపురం గ్రామాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతిన్నదని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. అయ్యవారిగూడెం సహకారం సంఘంలో కేవలం వడ్డీ మాత్రమే మాఫీ జరిగిందని, రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బూత్ కమిటీల ద్వారా గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేలా పోరాడుతామన్నారు. పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నూతక్కి నర్సింహారావు, కత్తి రవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, గడ్డం శ్రీహరి, దివ్వెల రంగా రావు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్‌పై మంత్రికి ఫిర్యాదు పట్ల మండల ప్రజల హర్షం

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరచూ మద్యం సేవించి విధులకు హాజరవుతూ, కార్యాలయంకు వచ్చే ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ మాకు వద్దే వద్దు సారూ అంటూ పలువురు స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసి, వినతి పత్రం అందించిన విషయం విధితమే. అయితే విషయం మండలంలోనే కాక నియోజకవర్గం, జిల్లా స్థాయిలో విస్తృత స్థాయిలో చర్చకు దారి తీసింది. మాకు వద్దే వద్దు సారూ అని ఓ సబ్ రిజిస్ట్రార్‌పై మంత్రికి ఫిర్యాదు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుందంటే ఆ అధికారి తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అటువంటి అధికారిపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కార్యాలయానికి వచ్చే సమయంలో మద్యం వేసించి రావడం, ఐదు మండలాలకు సేవలు అందించాల్సిన కార్యాలయంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఆ శాఖ జిల్లా స్థాయి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహారించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంత జరుగుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉండటంతో అంతర్యం ఏమిటని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ విషయంపై శుక్రవారం బూర్గంపాడు మండలంలో పర్యటించిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన స్థానికులు తమ గోడును మంత్రికి వెళ్లబుచ్చుకోవడం, ఈ విషయం జిల్లా స్థాయిలో తీవ్ర చర్చకు దారితీసింది.కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద




లేకుండా మాట్లాడుతూ, అకారణంగా గొడవలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నడం, సర్టిఫికెట్స్ కోసం వచ్చే ప్రజలను లంచాలు అభ్యర్థిస్తూ, ఇవ్వకపోతే కాలయాపన చేస్తూ నానా ఇబ్బందులు పెడుతున్నారని మంత్రికి తెలపడం, సదరు రిజిస్ట్రార్ గతములో పని చేసిన చోట మూడు సార్లు సస్పెండు అయి ఉన్నాడని సైతం మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్వయంగా ప్రజలే బూర్గంపాడు సబ్ రిజిస్టర్‌పై చర్యలు తీసుకుని, వేరే రిజిస్ట్రార్‌ను బూర్గంపాడు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో నియమించి మండలంలోని ప్రజలకు న్యాయము చేయాలని మంత్రిని కోరడంపై మంత్రి ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## ఏదులాపురంలో మైక్రో ఫైనాన్స్ వేధింపులు

**- నిరుపేద దళిత ఇల్లు జప్తు చేస్తామని బెదిరింపులు**
**- ఆత్మహత్య చేసుకుంటామని బాధితుల ఆవేదన**

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం గ్రామంలో గల ఎస్‌సీ కాలనీ మహిళలపై మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వేధింపులకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఎటువంటి సెక్యూరిటీ లేకుండా..కేవలం ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి ద్వారా కళావతి, చిలుముల అరుణ, నవిళ్ల ధనలక్ష్మి కి రూ.50వేల చొప్పున అప్పుగా ఇచ్చారు. ఇందులో బీమా, ప్రాసెసింగ్ ఫీజు పేరిట రూ.2వేలు ముందే కోత పెట్టారు. దీనికి గాను కట్టవలసి ఒక నెల ఈఎంఐ అమౌంట్ 2వేళ670 రూపాయలను సదరు నిరుపేదలు కట్టలేకపోయారు. ఈ నేపథ్యంలో సదరు మైక్రో ఫైనాన్స్ సిబ్బంది, మేనేజర్ ఆ మహిళలను డబ్బులు కట్టాలని ఇంటి ఎదుట బైఠాయించారు. కనీసం వారిని మంచినీళ్లు కూడా తాగనీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. అక్కడితో ఆగకుండా వారికి ఉన్న గుడిసెలను సైతం తాలం వేసి స్వాధీనపరుచుకుంటామని భయభ్రాంతులకు గురి చేశారు. వారి బెదిరింపులు తాళలేక మనస్థాపానికి గురైన సదరు బాధిత దళిత మహిళలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని



పేర్కన్నప్పటికీ బీమా ఉందని వ్యాగంగా మాట్లాడారు. ఇక చేసేది లేక సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తాం అనడంతో అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయంపై ఎస్ఐ అనిల్‌ను వివరణ కోరగా..ఫైనాన్స్ వసూళ్ల పేరిట బాధితుల ఇండ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడటం చట్టరీత్యా నేరం అన్నారు. బాధితులు నేరుగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగతుందన్నారు. ఫైనాన్స్ వారు నిబంధనల మేరకు నడుచుకోవాలి తప్ప చట్టాన్ని అతిక్రమించవద్దని సూచించారు.

## రాబోయే రోజుల్లో ఛాంపియన్ బిఆర్ఎస్

**27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయండి : సండ్ర**



ప్రజాపక్షం/సత్తుపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో పూర్తి స్థాయిలో వ్యతిరేకత ఉందని, రాబోయే రోజుల్లో బి.ఆర్.ఎస్ పార్టీ ఛాంపియన్ గా అవతరించబోతుందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జోష్యం చెప్పారు. పట్టణంలోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్ లో టిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ యాగంటి శ్రీను అధ్యక్షతన పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు. ముందుగా ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపెల్లి రామయ్య మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సండ్ర మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించాబోతున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రజోత్సవం సందర్భంగా మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో, మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయాలని నాయకులు, కార్యకర్తలు తెలిపారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం పాలన ఎలా ఉందో ప్రజల్లో చర్చ నడుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇన్ని రోజుల్లో అరచేతిలో బెల్లం పెట్టీ, మోచేతిలు నాకించే విదంగా వారి పాలన ఉందని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం తప్ప కొనుగోళ్లు లేవని, తద్వారా రైతాంగం దారుణంగా నష్టపోతుందన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ పూర్తిగా పడకేసిందని, మనం ఉన్నప్పుడు పచ్చగా కళ, కళలాడిన పల్లే ప్రకృతి వనాలు ఇప్పుడు ఎండిపోయాయని, పల్లె ప్రకృతి వనాలు నరికేసిన పట్టించుకునే నాథుడు లేదని,హెచ్‌సియూ లో పర్యావరణం ప్రమాదం లో పడిందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకం కింద మనం చీరతో పాటు లక్ష చెక్కు ఇచ్చే వాళ్ళమని, ఇప్పుడు కళ్యాణ లక్ష్మి లేదు,షాది ముబారక్ లేదని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అధికారంలోకి రావడం కోసం దళితులకు, రైతులకు మాయమాటలు చెప్పారని, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి మీద ప్రణాళిక లేదని, పారిశుధ్యం మీద శ్రద్ధ లేదని, కేసీఆర్ ఆనవాళ్లు చెరుపుదాం అనే ఆరాటమే తప్పితే, అభివృద్ధి మీద దృష్టి లేదని, రైతు బంధు, రుణమాఫి లేదని పూర్తిగా అమలు కాలేదని, ఒకప్పుడు సక్రమంగా వచ్చిన రైతుబంధు ఇప్పుడు ఎందుకు రావడం లేదని, ఇది వాయిదాల ప్రభుత్వం తప్ప అభివృద్ధి చేసే ప్రభుత్వం కాదని మండిపడ్డారు. ప్రజలు, రైతులు రైతు కూలీల ఇలా అన్ని వర్గాల్లో ఈ ప్రభుత్వం మీద వ్యతిరేకత వచ్చిందని, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది కేసీఆర్ కేటీఆర్ మాత్రమేనన్నారు. తదనంతరం రజోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్లు శీలపురెడ్డి కృష్ణారెడ్డి, వనమా వాసు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రఫీ , సీనియర్ నాయకులు దొడ్డా శంకర్ రావు, మోరంపూడి ప్రభాకర్, కాల్నేని వెంకటేశ్వరరావు, తుమ్మూరు దామోదర్ రెడ్డి, రవి, మల్లూరి అంకమరాజు, మోదుగు పుల్లారావు, అయూబ్ పాషా, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వెదుళ్ళ నాగు, జానకిరామ్, వినుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పట్టపగలే..గుప్పుమంటున్న గుడుంబా..!

**-పెద్ద ఎత్తున సారా బట్టీలు**
**-లక్షల్లో అక్రమ వ్యాపారం**
**మామూళ్ళమత్తులో అధికారులు**



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో బూర్గంపాడు, అంజనాపురం, బుడ్డగూడెం, కృష్ణసాగర్, గోపాలపురం సారా ఏరులై పారుతోన్నట్లు తెలుస్తోంది. పరిధిలోని కిన్నెరసాని పరివాహక ప్రాంతాలు, అడవి ప్రాంతంలో పెద్ద ఎత్తున సారా బట్టీలు ఏర్పాటు చేసి పట్టుకుంటే వదిలేస్తా సింటికేటు అన్నట్లుగా....తమను పట్టుకునే వారు ఎవరు మా దందాను అడ్డుకునే వారు ఎవరు అన్న వ్యవహార శైలితో ఒక తరహా మాఫియానే నడిపిస్తున్నారని చెప్పక తప్పదు. యథేచ్ఛగా పట్టపగలే సారాను పలు మార్గాల ద్వారా పార్సిల్ చేసి గ్రామాలకు తరలిస్తున్నారంటే వారి దందా ఏ స్థాయిలో జరుగుతుందో ఇట్లే ఊహించవచ్చు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.

**సినిమా తరహాలో సారా బట్టీలు ఏర్పాటు...**

మనం ఏదో ఒక సినిమాలో సారా బట్టీలు, సారా ప్యాకెట్లు సరఫరా చేసే దృశ్యాలను చూస్తూ ఉంటాం...నిజంగానే ఎక్కడైనా చూడాలి అన్న కనిపించే పరిస్థితులు ఉండవు. కానీ బూర్గంపాడు మండల పరిధిలోని బూర్గంపాడు, అంజనాపురం, బుడ్డగూడెం, కృష్ణసాగర్, గోపాలపురం గ్రామమ అడవి ప్రాంతాలు, కిన్నెరసాని పరివాహక ప్రాంతాల్లో సినిమాల్లో కనిపించే సారా బట్టీలు సారాని సరఫరా చేసే దృశ్యాలను కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంటాయి. ఇంద జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మొద్దు నిద్రలోనే ఉంటున్నారని చెప్పాలి.

**ప్రతి రోజు లక్షల్లో గుడుంబా అక్రమ వ్యాపారం...**

ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సారా బట్టీలు ఏర్పాటు చేయడంలో కొందరు గ్రూప్‌గా ఏర్పడి ప్రతి రోజు లక్షల్లో సారా అక్రమ వ్యాపారం సాగిస్తూ, నెలకు కోట్లలో వ్యాపారం సాగుతుందనే జగమెరిగిన సత్యం. అయితే ఈ సారా తయారీ యూరియాతో చేస్తుండటం గమనార్హం.

**అధికారులు ముడుపుల మత్తులో ఉన్నారా...**

బహిరంగంగా ఇంత పెద్ద మొత్తంలో పట్టపగలే అక్రమ బట్టీలు, సారా వ్యాపారం సాగుతుంటే ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు అంటే వారికి నెలనెల ఆమ్యామ్యాలు అందుతున్నాయని అంటూ గ్రామాల వారీగా ప్రచారం జోరున సాగుతుంది.

**యూరియాతో తయారీ...**

రాష్ట్రంలో గుడుంబా నిషేదింతో ఉంది. దీంతో నిర్వాహకులు గుట్టు చప్పుడు కాకుండా సారాను తయారీ చేస్తున్నారు. రహస్యంగా బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అయతే గతంలో బెల్లం, పట్టికతో తయారు చేసే వారు, కానీ ప్రస్తుతం యూరియాతో గుడుంబా తయారు చేస్తున్నారు. ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం.

**ఉన్నత శాఖ అధికారులు దృష్టి సారించాలి...**

ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికార యంత్రాంగం సారా బట్టీలు, సారా అక్రమ రవాణా బెల్లం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమార్కుల పని పట్టే చర్యలు తీసుకోవాలని, అదే విధంగా విధుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న సిబ్బంది, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రాజ్యాంగాన్ని ధిక్కరించే వారికి దేశంలో ఉండే హక్కు లేదు..

**-ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: భారత రాజ్యాంగాన్ని ధిక్కరించే వారికి దేశంలో ఉండే హక్కు లేదని ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు వనమా గాంధీ అధ్యక్షతన మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జూ సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమని, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి సాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసి విధంగా, అదే విధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానిస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ ఆ ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు ఎవరైనా సరే భారతదేశంలో ఉండే హక్కు వారికి లేదని ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తుల, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, ఎస్టీ, కిసాన్, మైనార్టీ సెల్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ సేవా దళ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు తిప్పి కొడదాం : జారే



ప్రజాపక్షం/చంద్రుగొండ: కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పందుతుందని వాటిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేస్తూ స్వతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బిజెపి పార్టీ దేశంలో రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తుందన్నారు. తొలుత మండల పరిధిలో పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ఎల్ఓసి చెక్కులు అందజేశారు. ఈకార్యక్రమంలో జైబాబు జై భీమ్ జై సమ్మిదాన్ అభియాన్ ఇన్చార్జ్ రామ్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దారం గోవింద్‌రెడ్డి, జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, తుమ్మలపల్లి సురేష్, నల్లమోతు రమణ, ఫజల్ కిరణ్‌రెడ్డి, బక్ష, ఇస్లావత్ రుక్మిణి, సంకశంకర్, బుంగ శ్రీను, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని ఘనంగా జరపాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని మండలంలో ఘనంగా జరపాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కండె రాంబాబు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14న జరిగే అంబేద్కర్ 134వ జయంతిని ఘనంగా జరుపుకోవాలని, అంబేద్కర్ విగ్రహాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు కండె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలకు హాజరైన మాజీ జెడ్‌పిటిసి దంపతులు




ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని పలు శుభకార్యాలకు మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరయ్యారు. శనివారం మండల పరిధిలోని ముసలమడుగు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొర్రా రాఘవులు, తిరుపతమ్మ దంపతుల ఏకైక పుత్రుడు సంపత్‌కుమార్ కావేరిల వివాహా మహోత్సవ వేడుకకు వారు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, నవ దంపతులకు ఆత్మీయ శుభాకాంక్షలును తెలిపారు. అదే విదంగా లక్ష్మీ పురం గ్రామానికి చెందిన దాసరి వెంకన్న(లేటు), నీలమ్మ దంపతుల ఏకైక పుత్రుడు దుర్గయ్య సౌజన్య ల వివాహా మహోత్సవ వేడుకకు వారు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, నవ దంపతులకు ఆత్మీయ శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం బూర్గంపాడు గ్రామానికి చెందిన కొండబోయిన వీర్రాజు సత్యవతి దంపతుల కనిష్ఠ పుత్రుడు సందీప్ యాదవ్, భావనల వివాహా మహోత్సవారికి వారు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, నవ దంపతులకు ఆత్మీయ శుభాకాంక్షలను తెలిపారు. అదే విధంగా ఇరవెండి గ్రామానికి చెందిన జింకల కృష్ణారెడ్డి, పద్మావతి దంపతుల కనిష్ఠ కుమార్తె సాయి ప్రసన్న రాజేష్‌రెడ్డిల ప్రధానం వేడుకకు వారు హాజరయ్యారు. కాబోయే నవ వధువును ఆశీర్వదించి, ఆత్మీయ శుభాకాంక్షలను తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ, నరేందర్ దంపతులు, బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ గోనెల నాని, సీనియర్ నాయకులు సిరిపురపు ప్రసాద్, మండల నాయకులు తోకల సతీష్, బాసిబోయిన గంగరాజు, గోళ్ళ శ్రీను, చిన్న గంగరాజు, గుండె సతీష్, బబ్బురాయుడు, మేకల నరసింహారావు, గడ్డం వెంకన్న, కళావతి దంపతులు, నల్లమోతు కృష్ణయ్య, తదితర పార్టీ నాయకులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## వనజీవి రామయ్యకు ఉపాధి కూలీల నివాళి



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని గుర్రంగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలు శనివారం వనజీవి రామయ్య మృతికి ఘనంగా నివాళులర్పించారు. గుర్రంగూడెం గ్రామంలో అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం పనులు చేసే పని ప్రదేశంలో చెట్ల వద్ద వనజీవి రామయ్యను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయన నాటిని మొక్కలు, వనాల గురించి చర్చించుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు నిర్వహించారు. శనివారం స్థానిక హనుమాన్ టెంపుల్ నుండి వేద పండితులు విప్పర్ల వెంకట కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా పోకలగూడెం, బెండాలపాడు గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో భోగి కృష్ణ, భోజ్యానాయక్, దయాకర్, సంపత్, నాగేశ్వరరావు, రఘుపతి, నాగ, కడియాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



**-కోల్డ్ స్టోరేజీ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలో పర్యటించారు. ముందుగా ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీని ప్రారంభించి 58వ డివిజన్ దొరన్న కాలనీలో టియుఎఫ్ ఐడిసి నిధులతో కోటి రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు, స్మార్ట్ వాటర్, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరన్న కాలనీలో కావాల్సిన మేరకు పెండింగ్ పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. మొదటి విడతలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని పేదలకు దశల వారీగా ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. పేదల కోసం ప్రతిపాదించిన ప్రతి పనిని పూర్తయ్యేందుకు స్థానిక ఎంపితో కలిసి కృషి చేస్తానన్నారు. పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణం, రూ. 500 గ్యాస్ సరఫరా, మహాలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీవుల్లా, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**- సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్**
**- డిప్యూటీ సిఎం భట్టి హామీతో దీక్ష విరమణ**



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని పాత రైల్వే గేటు వద్ద ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, టిడిపి, ఎమ్మార్పీఎస్ పార్టీ, స్థానిక వ్యాపారులు ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పాత రైల్వే గేటు మార్గం గుండా నిత్యం వందలాది మంది పాదచారులు వివిధ పనులకు కోసం ప్రయాణిస్తుంటారని, పరిసర ప్రాంతాల గ్రామాలు, పట్టణ ప్రజలకు పక్కనే ఉన్న ఆర్వోబిని ఎక్కేందుకు కష్టతరం కావటంతో ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారని, ఈ మార్గాన్ని గోడ కట్టి మూసి వేస్తే ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటారని, ప్రత్యామ్నాయ మార్గం చూపే వరకు ఉద్యమం ఆగదన్నారు. మధిర వన్ టౌన్, టూటౌన్ కు గొలుసుకట్టుగా ఉన్న రైల్వే ట్రాక్‌కు మార్గాన్ని మూసివేస్తే మధిర పట్టణం రెండుగా విడిపోతుందని, ఇప్పటికే మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులు వలన వ్యాపారాలు లేక వ్యాపారులు దివాలా తీసే పరిస్థితికి వచ్చిందన్నారు. రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ నిరసన దీక్షలకు బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని, దీనిపై డిప్యూటీ సిఎం భట్టివిక్కరమార్క స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన దీక్షను సందర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ సమస్యను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు, తక్షణమే స్పందించిన భట్టి రైల్వే అధికారులతో మాట్లాడి నడకమార్గం వదలి గోడ నిర్మాణం చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రైల్వే శాఖ మధిర ఎఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ అండర్ రైల్వే పాస్ నిర్మాణం చేపట్టేంత వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా మూడు అడుగులు దారి ఏర్పాటు చేయటం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీంతో నిరసన దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బెజవాడ రవిబాబు, మదుపల్లి గోపాలరావు, శీలం నర్సింహారావు, పాపినేని రామనర్సయ్య, మల్లాది హన్మంతరావు, రిటైర్డ్ ఎంపిడిఓ మురళీధర్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కూరపాటి సునీల్ మాదిగ, నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న మోడీ సర్కార్




**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న మోడీ సర్కార్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం పాల్వంచ పట్టణంలోని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కార్పొరేటీకరణ, కాషాయికరణ కుట్రలు చేస్తున్నారన్నారు. మోడిపాలనలో ఉద్యోగాల కల్పన అటుపెడితే తొలగింపులే ఎక్కువయ్యాయని, కేంద్రం మతాన్ని, కులాన్ని అడ్డుపెట్టుకుని హిందుత్వ ఎజెండాతో పాలన సాగిస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ నిర్భందాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకు భంగం వాటిల్లిందని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కేంద్రంపై తిరుకుబాటు చేయకుంటే దేశంలో సేవ్చావాయివులు పీల్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, మడుపు ఉపేంద్రచారి, గిరి, శ్రీను, రహమాన్, సత్యనారాయణ, అప్పారావు, కృష్ణ, రామారావు, అజిత్, బిక్కులాల్, వెంకన్న, లక్ష్మి, రమేష్, ప్రభాకర్, రవి, రంగయ్య, కరీం, గోపి, నాయుడు, వెంకన్న పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/భద్రాచలం :** కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శేషగిరినగర్ వద్ద తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా తారసపడ్డ లారీలో రూ.3 కోట్ల 63 లక్షల 68 వేల గంజాయిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా యుపి82ఏటి9894 నెంబర్ గల లారీని ఆపి సోదాలు నిర్వహించారు. ఈ లారీలో 717.360 కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ లారీలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివమ్ గుప్తా అనే వ్యక్తి పట్టుబడ్డ లారీ డ్రైవర్ భూరిసింగ్, రవికుమార్ అనే ఇద్దరు వ్యక్తులను ఏపిలో గల అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని తులసిపాక గ్రామ అటవీ ప్రాతంలో లోడ్ చేసుకుని రావాలని చెప్పి పంపించాడు. లారీలో కొత్తగా ఛాంబర్‌లా తయారు చేసి ఎవ్వరికీ అనుమానం రాకుండా లోడ్ చేశారు. అక్కడి నుండి బయలు దేరి భద్రాచలం మీదుగా ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఆగ్రాకు తరలించేందుకు ప్రయత్నించారు. గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కొత్తగూడెంలో కాపుగాసి 1 టౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తగా పట్టుకున్నారు. గంజాయిని స్వాదీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న 10 మందిపై కేసులు నమోదు చేశారు.

# రోలర్ స్కేటింగ్‌లో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థిని ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోలర్ స్కేటింగ్ క్రీడలో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థిని పసుపులేటి వీక్ష ప్రతిభ కనబర్చి సిల్వర్, బ్రాంజ్ మెడల్‌ను సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో ఎల్ఆర్ఐఎస్ఏ, సిఎస్‌సి సంస్థ నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీలో వీక్ష రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకుంది. ఎస్ఎస్ రోలర్ స్కేటింగ్ అకాడమీ నిర్వహించిన పోటీల్లోనూ వీక్ష బ్రాంజ్ మెడల్‌ను సాధించింది. రోలర్ స్కేటింగ్‌లో వరుసగా మెడల్స్ సాధిస్తున్న పసుపులేటి వీక్షను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు శనివారం వీక్షకు మెడల్స్, మెరీట్ సర్టిఫికెట్ అందించి అభినందించారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/గుండాల :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా , వరంగల్ పట్టనంలో నిర్వహించే రజతోత్సవ సభకు పార్టీశ్రేనులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిదిలోని దామర్‌తోగు గ్రామంలో కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రికలను కార్యకర్తలతో కూడి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌జిల్లా ఎలకతుర్తి వద్ద ఈ సభ నిర్వహిస్తున్నారని కార్యక్రమానికి మాజి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేకర్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో తెల్లం భాస్కర్, రావుల సోమన్న, సుతారి సత్యం, నాగేశ్వరావు, గడ్డం వీరన్న, తాటి క్రిష్ణ, బొమ్మెర్ల శ్రీను, రాంబాబు, సుదాకర్, పద్మారావు, సతీష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# గార్డెనింగ్, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికుల పనివేళల్లో మార్పులు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి ఫారెస్ట్ విభాగంలో వివిధ పార్కుల్లో కొత్తగూడెం నర్సరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేసవి కాలం నేపథ్యంలో ఏఐటీయూసి విజ్ఞప్తి మేరకు పనివేళలో మార్పులు చేసిన సింగరేణి ఫారెస్ట్ అధికారులకు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టాఫర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం కొత్తగూడెం సింగరేణి నర్సరీ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తీవ్రమైన ఎండల నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులు విధినిర్వహణలో తీవ్ర అలసటకు గురి అవుతున్నారని వారికి ఉప సమనం కొరకు సింగరేణి ఫారెస్ట్ అధికారులు తీసుకున్న నిర్ణయం పట్ల అభినందనలు తెలిపారు. అలాగే అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందించాలని, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు కొత్త సర్కులర్ ప్రకారం కనీస వేతనాలు, సీఎంపిఎఫ్,బ్యాంకు వేతనాలు వెంటనే అమలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణకుమారి,శారద,లీల. రమా,జ్యోతి,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ గ్రామ పంచాయతీ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కొత్తగూడెం పీఏసీఎస్ డైరెక్టర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సంజీవి, కరిష రత్నకుమారి, బానోత్ ధర్మ, మాచర్ల శ్రీనివాస్, అంబేద్కర్, శ్రీనివాస్ రెడ్డి, జోసఫ్, మీనా, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు నియామకం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక తహశీల్దార్ జె.మానిక్యరావ్ పై బదిలీ వేటు పడింది. సెప్టెంబర్ 6 న నేలకొండపల్లి తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. అదిలాబాద్ జిల్లా నుంచి బదిలీలలో భాగంగా నేలకొండపల్లి తహశీల్దార్ గా వచ్చారు. కాగా వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే తనను అదిలాబాద్ జిల్లా కు బదిలీ చేయాలని కలెక్టర్ కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ శనివారం తనను నేలకొండపల్లి తహశీల్దార్ పోస్టింగ్ నుంచి బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయంకు అటాచ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం లో ధరణి విభాగంలో సూపరిండెంట్ గా పని చేస్తున్న వి.వెంకటేశ్వర్లు ను నేలకొండపల్లి తహశీల్దార్ గా పోస్టింగ్ ఇస్తూ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాగా ఏడు నెలల కాలంలోనే ఆకస్మిక బదిలీ చేయటంతో చర్చంశనీయంగా మారింది.

# ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రజా వైద్యులు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రజా వైద్యులు పట్టించుకోవడం లేదని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామాలలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు వారి వైద్యం ఎంబిబిఎస్ వైద్యం కంటే మించి ఉంటున్న పట్టించుకోనటువంటి మండల ప్రభుత్వ వైద్యాధికారులు మండలంలో ప్రజల చర్చించుకుంటున్న పెడచెవిన పెడుతున్నటువంటి పరిస్థితి దాపురించిందని వారన్నారు. తక్షణమే మండలలో ఉన్న ఆర్ఎంపీలు పీఎంపీలను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించి అధిగమించిన వైద్యం చేయకండి మీరు చేసే ఒక ఫస్ట్ఎయిడ్ తప్ప వేరే ఏ వైద్యం చేయకూడదు అంటూ అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆర్ఎంపీల వైద్యశాలను పిఎంపీల వైద్యశాలను సీజ్ చేస్తామని హెచ్చరించి ప్రజలను కాపాడాలని ఆయన కోరుతూ శనివారం జూలూరుపాడు మెడికల్ ఆఫీసర్ కు మెమరాండం అందించడం జరిగిందని ఆయన అన్నారు.